## విశ్రాంత ఉద్యోగులకు సంఘం అండగా ఉంటుంది



మాట్లాడుతున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సభ్యుడు సత్యనారాయణ

బాన్సువాడ టౌన్, జూలై 29 : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు సంఘం అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సభ్యుడు ఎస్.ఎల్.సత్యనారాయణ తెలిపారు. బాన్సువాడలోని ఆర్టీసీ బస్‌డిపో దగ్గర విశ్రాంత ఉద్యోగుల సంఘం బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. కార్మికుల ప్రధాన సమస్యలైన 2017 పేస్కేల్, ఏరియర్స్, 2019 నుంచి రిటైర్‌మెంట్ అయిన కార్మికులకు ఇప్పటివరకు బెనిఫిట్స్ రాలేదని అన్నారు. కార్మికుల మిగిలిన సెలవుల బెనిఫిట్స్ డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కార్మికుడు మృతి చెందితే అదేరోజు చావు ఖర్చు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమస్యలపై కార్మికులు కలిసికట్టుగా నిలబడాలని విశ్రాంత ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాన్సువాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కౌసర్, కార్యదర్శి శంకర్, మహ్మద్, నాగ్‌నాథ్, ఫరీద్, పండరి, బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన ఎల్ఐసీ ఏజెంట్లు

కామారెడ్డి, జూలై 29 : జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శివాజీరావు, అధ్యక్షుడు రామ్‌శెట్టి శేఖర్, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథం, భూంరావు, కార్యదర్శిగా సామల సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేశ్, కోశాధికారిగా శంకర్, సికింద్రాబాద్ డివిజన్ కార్యవర్గ సభ్యుడిగా రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల లచ్చయ్య, బ్లియాస్ సౌత్ సెంట్రల్ జోన్ గౌరవ అధ్యక్షుడు సంపత్ రావు, అధ్యక్షుడు ఫణీంద్ర కుమార్, కోశాధికారి సత్యనారాయణ రెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్లు నరేందర్‌రెడ్డి, కొండల్ రెడ్డి, రమేశ్, సుధాకర్, ధర్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాటేసే కాలం జరభద్రం



- వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పాము కాటేసిన వెంటనే దవాఖానకు వెళ్లాలని వైద్యుల సూచనలు




కామారెడ్డి, జూలై 29 : వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాముకాటు ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. రైతులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. పాములు ఎక్కువగా గుబురుబురు పొదలు, పొలాల్లో రక్తపింజర మాటువేసి ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణహాని జరుగుతుంది. పొలాల వద్ద నివాసం ఉండే వారు, చెట్ల పొదల వద్ద ఇండ్లు ఉన్న వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో సంచరిస్తూ ఇండ్లలోకి ప్రవేశిస్తాయి. ప్రతి ఏటా పాము కాటుకు గురై 60 నుంచి 70 మంది మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

**ఏ పాముతో విషం ఎక్కుతుంది..**

పాముకాటు అనేది చాలా ప్రమాదకరమైనది. కానీ కొన్ని పాములతో ఎలాంటి అపాయం ఉండదు. మరికొన్ని పాములతో చాలా ప్రమాదం ఉంటుంది. కట్లపాటు కాటేసిన క్షణంలోనే విషం రక్తంలోకి ప్రవేశించి మృతి చెందే అవకాశం ఉంటుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఆందోళనకు గురికాకుండా వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. నాగు పాము కాటేసిన 15 నిమిషాల్లో విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తర్వాత విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరు కట్ట పాటు కాటేసినా విషం ఉండదు. కాటేసిన చోట చికిత్స చేయడానికి దవాఖానకు తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైనప్పుడు ఆందోళన చెందొద్దు. ఇది గుండె పోటుకు దారితీస్తుంది. దవాఖానలో వైద్యులకు స్పష్టంగా చెబితే అక్కడ యాంటి స్నేక్ వీనం ఇంజక్షన్ అందుబాటులో ఉంటాయి. రక్తం గడ్డకట్టే అవకాశం ఉంటే దానికి ఈ ఇంజక్షన్ పనిచేస్తుంది. గుండెపోటు రాకుండా ఈ మందు ఉపకరిస్తుంది.

**పాముకాటు లక్షణాలు..**

వ్యక్తిని విషపూరితమైన పాము కరిచినప్పుడు శరీరమంతా నీలం రంగుగా మారడం, రక్తపోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కాటువేసిన చోట నొప్పి, వాపు ఉంటుంది. మరికొందరిలో పొక్కులు, దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి నురగ వస్తుంది. ఆయసపడి చెమటలు పట్టి ఉంటే సాధారణ స్థాయికన్నా రెట్టింపు స్థాయిలో గుండె కొట్టుకుంటుంది. ఈ లక్షణాలు ఉన్నప్పుడు తక్షణమే దవాఖానకు తీసుకెళ్తే ఎటువంటి ప్రాణహాని ఉండదని వైద్యులు చెబుతున్నారు. పాము కాటుకు గురైన వారికి 99 శాతం బతికించే అవకాశం ఉంటుందని వైద్యులు అంటున్నారు.

### పాముకాటు బాధితుడికి ధైర్యం చెప్పాలి



పాముకాటుకు గురైన బాధితుడికి ముందుగా ధైర్యం చెప్పి వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయాలి. బాధితునికి ధైర్యం చెప్పకపోతే భయపడి ఆందోళనతో చికిత్స చేయకుండానే ప్రాణం కోల్పోతాడు. రైతులు, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

**- డాక్టర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో**

## మాజీ ఎమ్మెల్యే జాజాలకు తీవ్ర అస్వస్థత



చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి, జూలై 29: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో పదిహేను రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ రావడంతో ఆయన దవాఖానలో చేరినట్లు సమాచారం. కొద్ది రోజులుగా ఆయన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో బీఆర్ఎస్ శ్రేణులు సైతం కొంత ఆందోళన గురయ్యాయి. ఈ మేరకు ఆయన సోమవారం ఓ వీడియోను వాట్సాప్‌లో పెట్టడంతో ఆయన ఆరోగ్య విషయం బయటికి తెలిసింది. తాను అనారోగ్యానికి గురైనట్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తన ఇంటికి రావద్దని, తానే పూర్తిగా కోలుకున్న తరువాత అందరినీ కలుస్తానని ఆయన వీడియోలో పేర్కొన్నారు.

## యువకుడి అదృశ్యం

బాన్సువాడ, జూలై 29 : బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్ పాషా అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెకానిక్ అయిన చాంద్‌పాషా ఈ నెల 27 బైక్‌పై బయటికి వెళ్లినట్లు తెలిపారు. తిరిగి సాయంత్రం వరకు రాలేదని, కుటుంబీకులు ఆచూకీ కోసం వెతికినా దొరకలేదన్నారు. యువకుడి అన్న సయ్యద్ షబ్బీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

-నాగిరెడ్డిపేట, జూలై 29

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

లింగంపేట, జూలై 29: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి రూ.13,500, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన బాలమణికి రూ. 11,500, లింగంపేటకు చెందిన లక్ష్మికి రూ.9,500, రవీందర్‌గౌడ్‌కు రూ.60వేలు, మెంగారం గ్రామానికి చెందిన బాలయ్యకు రూ.60వేలు, ముంబాజీపేటకు చెందిన లచ్చవ్వకు 11వేలు, శెట్పల్లికి చెందిన హంశ్రీకి రూ. 10,500 చెక్కులను అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు రామాగౌడ్, నగేశ్, నాయకులు నవీద్, భాస్కర్‌గౌడ్, శివలాల్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రభాకర్

బీబీపేట్, జూలై 29: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. బీబీపేట్‌లోని మల్కాపూర్ రోడ్డు సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్స్ వద్ద సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డును అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారినపడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శంకర్, రంజీత్‌గౌడ్, శృతి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలకు ట్రీ గార్డుల ఏర్పాటు



డివైడర్ మధ్యలో నాటిన మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులు

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

గాంధారి, జూలై 29: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్ మధ్యలో నాటిన మొక్కలను మేకలు తింటున్నాయి. ఈ విషయమై నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'నాటిన మొక్కలు, మేకల పాలు' శీర్షికన సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. డివైడర్ మధ్యలో నాటిన మొక్కలకు రక్షణగా ట్రీ గార్డులను ఏర్పాటు చేయించారు. ట్రీగార్డుల ఏర్పాటుతో మొక్కలు ఏపుగా పెరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా యోగేశ్



మద్నూర్, జూలై 29: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వంగపల్లి వార్ యోగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సమావేశంలో సభ్యులందరూ ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సమాజ్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సమాజ్ సభ్యులతోపాటు మాజీ ఎమ్మెల్యే మనవడు తమ్మేవార్ అజయ్ సన్మానించారు.

# మత్తడి కాలువకు బుంగ

### వృథాగా పోతున్న నీరు



లింగంపేట, జూలై 29: మండలంలోని నల్లమడుగు గ్రామ న్యాలమత్తడి కాలువకు బుంగ పడడంతో నీరంతా వృథాగా పోతున్నట్లు రైతులు తెలిపారు. వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా చెక్‌డ్యాం నుంచి వరద న్యాల మత్తడి కాలువ ద్వారా నల్లమడుగు గ్రామంలోని ఊర చెరువులోకి వస్తున్నట్లు చెప్పారు. చెరువులోకి నీటిని సరఫరా చేసే కాలువకు బుంగ పడడంతో వరద చెరువులోకి రాకుండా వృథాగా పోతున్నట్లు తెలిపారు. న్యాలమత్తడి కాలువ నుంచి వచ్చే వరదతో సుమారు రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. కాలువతోపాటు ఊర చెరువు ఆయకట్టు కింద సైతం సాగు నీటిని అందిస్తుందని తెలిపారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి వెంటనే బుంగను పూడ్చి వేసి నీటి వృథాను అరికట్టాలని కోరారు.

## పిచ్చి మొక్కలను తొలగించండి



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నాగిరెడ్డిపేట, జూలై29: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. చెట్లు ఏపుగా పెరగడంతో కోతులకు నివాసంగా మారాయి. పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

## ప్రమాదరకంగా గండివేట్, సీతాయిపల్లి రోడ్డు



గండివేట్ రోడ్డుపై కల్వర్ట్ కూలడంతో ఏర్పడిన గుంత.

గాంధారి, జూలై 29: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గండివేట్, సీతాయిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారింది. కల్వర్టు కూలిపోయి పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు దగ్గరికి వచ్చే వరకూ కనిపించడంలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రతిరోజూ ఈ రోడ్డు గుండా గండివేట్, సీతాయిపల్లి గ్రామాల ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బాన్సువాడ, ఎల్లారెడ్డి, వెలుట్లపేట, కంచుమల్, కొండాపూర్ తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిజేస్తున్న ఎస్.ఆర్ ఫౌండేషన్ సభ్యులు

భిక్కనూరు, జూలై 29 : తాను చనిపోతూ అవయవదానం చేసి ప్రాణం పోసిన భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్ కుటుంబానికి ఎస్.ఆర్ ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఇంటి పైకప్పు కోసం రూ.20 వేలు అందించిన తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి ప్రవీణ్ భార్య రేఖ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్, రెడ్డి సంఘం అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, సాయాగౌడ్, వెంకట్ స్వామి గౌడ్, రవీందర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, మెజీషియన్ సంతోష్ పాల్గొన్నారు.

## పాల బిల్లులు త్వరగా ఇవ్వండి

రామారెడ్డి, జూలై 29: రెండు నెలలుగా పెండింగ్ ఉన్న పాల బిల్లులు చెల్లించాలని రైతులు కోరారు. మండల కేంద్రంలోని విజయ పాల కేంద్రం నిర్వాహకుడు బానూరి నర్సారెడ్డి సోమవారం మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి రైతులకు పాల బిల్లులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఖర్చులకు తమ సొంత డబ్బులు ఇవ్వాల్సి వస్తోందన్నారు. ప్రతినెలా పశువులకు దాణా, పోషణకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



రామారెడ్డిలోని విజయ పాలకేంద్రం

## లింగంపేట్‌లో పారిశుద్ధ్య పనులు

లింగంపేట, జూలై 29: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. మురికి కాలువల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ కార్మికులు తొలగించడంతోపాటు మురికి కాలువలను శుభ్రం చేస్తున్నారు. మండల కేంద్రంలో జ్వర బాధితుల సంఖ్య పెరిగిపోవడంతో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మురికి కాలువలు శుభ్రం చేయించడంతో పాటు దోమల నివారణకు మందులను పిచికారీ చేయిస్తున్నారు. ఈగలు, దోమలు వృద్ధిచెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఆరుబయట చెత్త వేయవద్దని దుకాణాల యజమానులకు సూచించారు.



మురికి కాలువలు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

## వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

నిజాంసాగర్, జూలై 29: నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం షీటీం, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు భద్రత,బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నియంత్రణ, డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 108, 1930,181 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై సుధాకర్, పోలీస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**

★WANTED HOME TUITION TEACHER for 1st and 3rd Class Students in Nizamabad Town Contact No: 8793032690

NTZ-340199

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను KOTALA ASHOK తండ్రిపేరు SAILU KOTALA R/o. ఇ.నెం.3-53/4, గ్రా॥ & మం॥ ఇందల్‌వాయి జి॥ నిజామాబాద్ TS, నా యొక్క పాస్‌పోర్ట్ నెం. S3377784 గల దానిని తీసుకొని తేది: 20.07.2024 నాడు మా ఇంటి నుండి బైక్ మీద ఇందల్‌వాయికి వెళ్తున్న సమయంలో ఎక్కడో పడిపోయినది. కావున దొరికినవారు ఈ నెంబర్‌కు తెలియజేయండి. సెల్:83411 24820

**CHANGE OF NAME**

I, MOHD AIJAZ AHMED S/o. SHAIKH SHAKEEL AHMED, R/o. H.No.13-64/A/132/1, Bapuji Nagar, Bheemgal, Nizamabad District, Telangana State Changed my name from 'MOHD AZAS' (Old Name) to MOHD AIJAZ AHMED (New Name). Henceforth, I Shall be known as MOHD AIJAZ AHMED S/o. SHAIKH SHAKEEL AHMED (New Name) vide affidavit dated 27/07/2024.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.